

ఏయూలో ఆస్ట్రేలియా విద్యార్థులు

విశాఖ విద్య: ఏయూను ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విక్టోరియా యూనివర్సిటీ విద్యార్థులు సోమవారం సందర్శించారు.



ఫార్మా కంపెనీలపై ఫిర్యాదు

విశాఖ: ఫార్మా ప్రమాదాలపై జీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గోవిందరావు మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.



సన్మార్గంలో ఆలోచించాలి

సీతమ్మధార : సన్మార్గంలో పయనిస్తే ప్రతికూల పరిస్థితుల్లో సైతం నెగ్గుకు రాగలమని **చిన్న జీయర్ స్వామి విశాఖలో** అన్నారు.

న్యూస్‌రీల్

పింఛన్ల పరిశీలన నేడు

యలమంచిలి రూరల్: కూటమి సర్కారు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం మాట అటుంచితే సామాజిక భద్రతా పింఛన్ల పరిశీలన పేరుతో పెన్షన్ల ఏరివేతకు రంగం సిద్ధం చేస్తోంది. యలమంచిలి మండలం పురుషోత్తపురం గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం పింఛన్ల పరిశీలన ఉంటుంది. పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన ఈ సచివాలయం పరిధిలో పురుషోత్తపురం, కొత్తలి, మెట్టపాలెం గ్రామాలున్నాయి. మొత్తం 491 మంది పింఛనుదారుల ఇంటికి వెళ్లి పరిశీలన చేయడానికి జిల్లా అధికారులు 10 బృందాలను నియమించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)ఆధ్వర్యంలో జరగనున్న పరిశీలన కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించారు. ఒక్కో బృందం 50 పింఛన్లను పరిశీలన చేయనున్నట్టు అధికారులు తెలిపారు. ఇంటింటికీ తనిఖీ చేసి అనర్హత ముద్ర వేసి పింఛన్లు తొలగించడానికే పరిశీలన చేపడుతున్నారని, ఎన్నో ఏళ్లుగా పింఛన్లు తీసుకుంటున్న తమ పొట్ట కొట్టడానికి కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

కలెక్టరేట్ ఏవోకు అస్వస్థత



అస్వస్థతకు గురైన ఏవో రాణిని ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

తుమ్మపాల: లో బీపీతో కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.వి.రాణి సోమవారం ఉదయం అస్వస్థతకు లోనయ్యారు. ఉదయం విధులకు హాజరైన ఆమె 11.30 గంటల సమయంలో సీట్‌లోనే ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోయారు. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ఆమెను ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించడంతో ఆమె స్పృహలోనికి వచ్చారు.

నడకదారిలో గంజాపై నిఘా



మాడుగుల మండలం రాజంపేట వద్ద డ్రోన్ నిఘా ఏర్పాటు చేసిన దృశ్యం

మాడుగుల: ఎస్పీ ఆదేశాలతో నడకదారులలో సోమవారం డ్రోన్ నిఘా ఏర్పాటు చేశామని ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు. ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులలో చెక్ పోస్టులు పెట్టడం వలన నడకదారులలో గంజాయి తరలిపోతుండడంతో ఈ విధంగా చేశామన్నారు. మండలంలో తాడివలస, రాజంపేట, కృష్ణంపాలెం ఏరియాలలో డ్రోన్ సర్వే ప్రారంభించామన్నారు.

రేపు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట (విశాఖ): జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఆమె చాంబర్ సమీపంలోని వీసీ హాలు, జెడ్పీ సమావేశ మందిరంలో ఏడు స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, **అధికారులు** సమావేశాలకు హాజరుకావాలని **కోరారు.**

తల్లికి తలకొరివి పెట్టిన పెద్ద కూతురు



తల్లికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న సత్యవతి

మునగపాక: కొడుకు లేకపోవడంతో కూతురే తల్లికి తల కొరివి పెట్టి కన్న రుణం తీర్చుకుంది. నాగులాపల్లికి చెందిన భీమరశెట్టి లక్ష్మి (80) అనారోగ్యంతో బాధ పడుతూ సోమవారం మృతి చెందింది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కొడుకులు లేకపోవడంతో మునగపాకలో ఉంటున్న పెద్ద కుమార్తె కాండ్రేగుల సత్యవతి తలకొరివి పెట్టేందుకు ముందుకు వచ్చింది. ముగ్గురు అల్లుళ్లు లక్ష్మి పాడె మోసి రుణం తీర్చుకున్నారు.



ఇదేం మేత

కోళ్ల వ్యర్థాలతో కాసుల వేట

- సహకరిస్తున్న జీవీఎంసీ, మత్స్యశాఖ, పోలీసు విభాగాలు
- చికెన్ వ్యర్థాల తరలింపునకు టెండర్లు పిలిచిన ప్రజారోగ్య విభాగం
- తమ వారికే టెండర్లు కావాలంటూ కూటమి నేతల ఒత్తిళ్లు
- నెలలు గడుస్తున్నా టెండర్లు తెరవకుండా తాత్సారం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

ఎక్కువ లాభాలు ఆర్జించాలన్న దురాశతో చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలను భారీ స్థాయిలో తరలిస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. అధికారులు కూడా సహకరించడంతో ఈ దందా యథేచ్ఛగా సాగిపోతోంది. జీవీఎంసీ **పరిధిలోని చికెన్, మటన్ షాపుల్లో వ్యర్థాలను** కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డుకు తరలించేందుకు రెండేళ్ల క్రితం కొందరు కాంట్రాక్టర్లు టెండర్లు పొందారు. అయితే ఈ కోళ్ల వ్యర్థాలను అక్రమంగా చేపల చెరువులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ వ్యవహారం జరుగుతున్నప్పటికీ.. ఇటు జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు గానీ, అటు మత్స్యశాఖ, పోలీసుశాఖ అధికారులు గానీ కన్నెత్తి చూడటం లేదు. కాపులుప్పాడలో నిర్దిష్ట మొత్తంలో సేకరించిన మేరకు చికెన్ వ్యర్థాలు వస్తున్నాయా? లేదా అని పరిశీలించాల్సిన అధికారులు కూడా ఇందులో భాగస్వామ్యమై తప్పుడు నివేదికలు సమర్పిస్తున్నట్టు తెలుస్తోంది. తాజాగా మాడుగుల నియోజకవర్గంలోని దేవరాపల్లి వద్ద చికెన్ వ్యర్థాలతో వచ్చిన వాహనాన్ని ప్రజలు ఫిర్యాదు చేసి పట్టించారు. ఇందులో అందరికీ భాగస్వామ్యం ఉండడంతో ఈ వ్యవహారాన్ని అక్కడికక్కడే తొక్కేశారు.

టెండర్లు తెరవకుండా పాత వారితోనే పనులు

వాస్తవానికి ప్రస్తుతం చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న ఏజెన్సీల టెండరు గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో కొత్తగా టెండర్లను ప్రజారోగ్య విభాగం అధికారులు పిలిచారు. కానీ నెలలు గడుస్తున్నా వీటిని మాత్రం తెరవడం లేదు. ఈ టెండర్లను దక్కించుకునేందుకు కూటమి నేతల నుంచి తీవ్ర ఒత్తిళ్లు వస్తుండటంతో టెండర్లు తెరవకుండా పాత వారితోనే పనులు కానిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారం నడుపుతున్న వారితోనూ జీవీఎంసీలోని అధికార పార్టీకి చెందిన నేతలు మామూళ్లకు అలవాటు పడటంతో వీరి ఆటలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి.

అధికారుల తీరుపై అనుమానాలు

గడువు ముగిసినప్పటికీ కొత్త టెండర్లను పిలిచి మరీ తెరవకుండా పాత వారినే కొనసాగించడంపై జీవీఎంసీ అధికారుల వ్యవహారశైలిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి రెండేళ్ల క్రితం ఆన్‌లైన్ టెండర్లు కాకుండా బాక్సు టెండర్లను ఆహ్వానించారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఆన్‌లైన్ టెండర్లను ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారానే చేపడుతున్నారు. జీవీఎంసీలో మాత్రం బాక్సులను వదలడం లేదు. అందులోనూ ప్రజారోగ్య విభాగంలోనే అధికంగా బాక్సు టెండర్లను ఆశ్రయిస్తుండటం గమనార్హం. తాజాగా పిలిచిన టెండర్లు కూడా బాక్సు టెండర్లేనని తెలుస్తోంది.

ఎందుకు ఈ వ్యర్థాలను వాడుతున్నారంటే..



కోళ్ల వ్యర్థాలను తినడం వల్ల చేపలు త్వరగా బరువు పెరగడంతోపాటు మేత ఖర్చు కూడా తగ్గుతుంది. సాధారణంగా చేపలకు ఆహారంగా తవుడు, సోయాబీన్ వంటి వాటితో ఉత్పత్తి చేసిన మేతను వాడతారు. ఈ మేత మార్కెట్‌లో కిలో రూ.30 వరకు ఉంటుంది. కిలో చేపను పెంచడానికి సుమారు రూ.50కిపైగా ఖర్చవుతుంది. కానీ ఆరోగ్యవంతమైన చేపలు ఈ ఆహారంతో అందుబాటులోకి వస్తాయి. అదే కోళ్ల వ్యర్థాలతో కిలో చేపను పెంచేందుకు రూ.30లోపే ఖర్చవుతుండటం, త్వరగా చేపలు బరువు పెరుగుతుండటంతో వీటిపైనే కొందరు పెంపకందారులు దృష్టిసారిస్తున్నారు. అయితే ఈ చేపలను తినే వారు అనేక వ్యాధుల బారినపడతారనే విషయాన్ని వారు గ్రహించలేకపోతున్నారు.

ఆరోగ్యానికి హానికరం



కోళ్ల వ్యర్థాలతో పెంచిన చేపలను తినడం ఆరోగ్యానికి హానికరం. కాలేయ, జీర్ణకోశ, న్యూరో సమస్యలతో పాటు పేగులో పుండ్లు, గ్యాస్ట్రిక్, మలబద్ధకం, పైల్స్, చర్మ వ్యాధులు వంటివి తలెత్తుతాయి. మహిళలకు నెలసరి, పలు రకాల క్యాన్సర్ సమస్యలు వస్తాయి. వీటిని తిన్న చిన్నారులైతే త్వరగా అనారోగ్యం బారిన పడతారు. పైగా కోళ్ల వ్యర్థాలు ఉపయోగించే లేదా నిల్వచేసే పరిసర ప్రాంతాలు పూర్తిగా వైరస్‌తో నిండి పర్యావరణానికి ముప్పు కలిగేలా తయారవుతుంది. అక్కడి గాలి కూడా ప్రమాదకరంగా మారుతుంది. ఈ గాలిని పీల్చేవారు త్వరగా వ్యాధుల బారిన పడతారు.

గత టెండర్లలోనూ మతలబు



అనకాపల్లి నుంచి కాపులుప్పాడకు చికెన్ వ్యర్థాలను తరలించేందురు తక్కువ ధరను కోట్ చేసిన కాంట్రాక్టర్లు.. మధురవాడ నుంచి కాపులుప్పాడకు తరలించేందుకు మాత్రం ఎక్కువ ధరను కోట్ చేశారు. దీనికి జీ హుజూర్ అంటూ తలూపిన జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు కాంట్రాక్టును కట్టబెట్టారు. అనకాపల్లి నుంచి యలమంచిలి, పెందుర్తి, మాడుగులలోని చేపలు చెరువులకు తరలించేందుకు దగ్గర కావడంతోనే తక్కువ ధరను కోట్ చేశారు. మధురవాడ నుంచి తరలించాలంటే ఎక్కువ దూరం, ఎక్కువ ఖర్చు అవుతుందని భావించి అధిక ధరను కోట్ చేశారు. అంతేకాకుండా కోళ్ల వ్యర్థాలను చేపలు, రొయ్యల చెరువులకు తరలిస్తున్నారన్న విమర్శల నేపథ్యంలో రద్దు చేశారు. అయితే, కోర్టు నుంచి ఆదేశాలున్నాయనే కారణంగా తిరిగి వీరికే కాంట్రాక్టును అప్పగించారు.

పట్టుబడుతున్నా పట్టించుకోరే...!



వాస్తవానికి అనకాపల్లిలో సేకరించిన కోళ్ల వ్యర్థాలను యలమంచిలి, మాడుగుల, పెందుర్తిలోని చేపల చెరువులకు, భీమిలి, విశాఖ నగరంలో సేకరించిన వాటిని బైపాస్ ద్వారా అవే ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇది చట్టరీత్యా నేరం. తాజాగా దేవరాపల్లి మండలంలో కోళ్ల వ్యర్థాలను చేపలు, రొయ్యల చెరువులో కలుపుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేయడంతో బయటపడింది. అయినప్పటికీ ఈ వ్యవహారాన్ని పక్కదారి పట్టించినట్టు తెలుస్తోంది.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ

- జాయింట్ కలెక్టర్ జాహ్నవి



ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న జేసీ జాహ్నవి, ఆర్డీవో ఆయిషా

దేవరాపల్లి: రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. ఆమె ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఆర్డీవో షేక్ ఆయిషాలతో కలిసి ఎం.అలమండలో జిల్లాలోనే తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోగా రైతు ఖాతాలో జమ అవుతుందన్నారు. రైతులు తమకు ఇష్టమైన మిల్లర్లను ఎంపిక చేసుకుంటే, జీపీఎస్ సిస్టమ్ ద్వారా సదరు మిల్లర్లకు ధాన్యాన్ని చేరవేస్తామన్నారు. సాధారణ రకం 100 కేజీలు రూ.2,300, ఏ గ్రేడ్ రకం రూ.2,320 చొప్పున కనీస మద్దతు ధర కల్పించి కొనుగోలు చేస్తామన్నారు. గోనె సంచులు ప్రభుత్వం సరఫరా చేస్తుందని, రవాణా చార్జీలను ప్రభుత్వమే రైతు ఖాతాలో జమ చేస్తుందన్నారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్ దాడి జగన్, జిల్లా అధికారి సివిల్ సప్లయి అధికారి కె.వి.ఎల్.ఎస్.మూర్తి, జిల్లా మేనేజర్ పి.జయంతి, జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు, మండల ప్రత్యేక అధికారి మంజులవాణి, తహసీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీవో ఎంవి.సువర్ణరాజు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ లెక్కింపు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం 39 రోజులకుగాను రూ.2 కోట్ల 81 లక్షల 93 వేల 913 వచ్చినట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై సోమవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 126.300 గ్రాముల బంగారం, 15.140 కిలోల వెండి లభించినట్లు ఈవో పేర్కొన్నారు. లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ ఆందోళనలు



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ ముఖ్యనేతలు



సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల అధ్యక్షులు, సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

- 13న ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాల అందజేత
- పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా 27న నిరసన
- జనవరి 3న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఆందోళన
- వైఎస్సార్‌సీపీ శ్రేణులతో శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స

సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ నెల 13 నుంచి జనవరి 3వ తేదీ వరకు వైఎస్సార్ సీపీ ఆందోళనలు చేపట్టనున్నట్లు శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, వైఫల్యాలు, ప్రజలు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ కార్యాచరణను ప్రకటించిందన్నారు. ఈ నెల 13న ధాన్యం సేకరణపైన, 27వ తేదీన పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా, జనవరి 3వ తేదీన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తమ పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు, పార్టీ ముఖ్య నేతలతో సమావేశమై చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరావు, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లపల్లి సుభద్ర, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ జి.మాధవి, మాజీ ఎమ్మెల్యేలు కంబాల జోగులు, రమణమూర్తి రాజు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, భాగ్యలక్ష్మి, తిప్పల నాగిరెడ్డి, తైనాల విజయ్‌కుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, చెంగల వెంకటరావు, శోభా హైమావతి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, జెడ్పీ వైస్ చైర్మన్ గురిబాబు, బి.సత్యవతి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు జాన్ వెస్లీ, పివిఎస్ఎన్ రవి, శోభాస్వాతిరాణి , చొక్కాకుల వెంకటరావు, పేర్ల విజయ్‌చంద్ర, పోతిన శ్రీనివాసరావు, సుజాత సత్యనారాయణ, బొడ్డేడ ప్రసాద్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, గొల్లగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జిల్లాలో ఏకైక మేజర్ ప్రాజెక్టు తాండవ

'కూటమి' కనికట్టు

- నీటి సంఘాల ఎన్నికల్లో మాయాజాలం
- ఓటరు జాబితాలో కొంత మంది రైతుల పేర్లు గల్లంతు
- నీటి తీరువా బకాయిల పేరిట పోటీకి అర్హత లేకుండా మెలిక
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల పేర్లు తొలగింపే వారి లక్ష్యం
- గెలవలేమనే భయంతోనే ఈ కుట్ర
- బకాయి ఉంటే నామినేషన్ స్వీకరించమంటున్న అధికారులు
- రేపు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- జిల్లాలో 16 మేజర్, 28 మీడియం, 259 మైనర్ నీటి సంఘాలకు ఎన్నికలు

నీటి సంఘాల ఎన్నికల్లో అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని కూటమి పార్టీల మద్దతు అభ్యర్థులను గెలిపించుకునేందుకు కుట్ర జరుగుతోంది. కూటమి నేతల కనుసన్నల్లోనే జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితాలు తయారు చేసినట్లుగా తప్పుల తడకలుగా ఉన్న ఓటరు లిస్టులను బట్టి తెలుస్తోంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ భూములకు సంబంధించి ఎలాంటి బకాయిలు లేకుండా ఉండాలని కొత్త నిబంధన విధించారు. దీని పేరుతో తస్మదీయుల పేర్లు తొలగించారన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి.

నాతవరం: జిల్లాలో 16 మేజర్, 28 మీడియం, 259 మైనర్ ప్రాజెక్టుకు సంబంధించి 303 నీటి సంఘాలున్నాయి. వీటిలో 2079 మంది ప్రాదేశిక సభ్యులను ఓటర్లు ఎన్నుకుంటారు. ప్రాదేశిక సభ్యులు ఎన్నుకునే నీటి సంఘాల అధ్యక్షులను, నీటి పంపిణీ సంఘాల అధ్యక్షులను కలిపితే మొత్తం 2,382 స్థానాల కోసం మూడు అంచెలుగా ఎన్నికలు జరగనున్నాయి. రెండుసార్లు వాయిదా పడిన అనంతరం ఈనెల 11న ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల కానున్న దశలో.. ఓటర్ల జాబితాల గురించి విమర్శలు వినిపిస్తున్నాయి. నీటి తీరువా, భూమి పన్నులు చెల్లించి ఉంటేనే నామినేషన్లను అనుమతిస్తామని కొత్త మెలిక పెట్టారు.

తమకు అనుకూలమైన వారికి పదవులు కట్టబెట్టే కుట్రలో భాగంగానే కూటమి నేతలు ఇలా పావులు కదుపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 2014 నుంచి నీటి తీరువా, భూమి పన్నులు వసూలు చేయడం లేదు. నాతవరం మండలంలోని తాండవ ఆయకట్టు పరిధిలో ఏడాదికి సుమారు రూ.3 కోట్ల వరకు బకాయిలు ఉంటాయి.

చకచకా ఎన్నికల ఏర్పాట్లు

అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. ఈనెల 14వ తేదీన పెద్ద, చిన్నతరహా నీటి సంఘాల అధ్యక్షుల ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ఈనెల 17వ తేదీన డిస్ట్రిబ్యూటింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. చివరిగా మేజర్ ప్రాజెక్టు తాండవ రిజర్వాయర్, మీడియం ప్రాజెక్టులైన రైవాడ, కోనాం, పెద్దేరు రిజర్వాయర్ల చైర్మన్ పదవులకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ ఎన్నికల తేదీని ఇంకా ప్రకటించలేదు. ఉమ్మడి జిల్లాలోనే మేజర్ ప్రాజెక్టుగా తాండవ రిజర్వాయర్ ఉంది. దీనికి సంబంధించి అనకాపల్లి, కాకినాడ జిల్లాల పరిధిలో 16 నీటి సంఘాల అధ్యక్షులు, ఐదుగురు డిస్ట్రిబ్యూటింగ్ కమిటీ డైరెక్టర్లు, ఒక చైర్మన్ ఉంటారు. తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌తో పాటు జిల్లాలో మీడియం ప్రాజెక్టులైన రైవాడ, కోనాం, పెద్దేరు ప్రాజెక్టు చైర్మన్ల పదవులను కూటమి ప్రభుత్వం జిమ్మిక్కులు చేసి దక్కించుకునేందుకు కుట్ర చేస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా ప్రాజెక్టుల పరిధిలో వైఎస్సార్ సీపీకి చెందిన రైతులు అధికంగా ఉన్నారు. ఇది గ్రహించిన కూటమి నేతలు ముందుగానే ఓటర్ల జాబితాలో భూములున్న రైతుల పేర్లు లేకుండా చేశారు. పేర్ల గల్లంతుపై ప్రశ్నించగా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తమకు సంబంధం లేదని తప్పించుకుంటున్నారు. తాండవ రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో అధిక శాతం రైతులకు భూములు ఉన్నప్పటికీ చాలా మందికి ఓటరు జాబితాలో పేర్లు లేకుండా చేశారు.

ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు



తాండవ రిజర్వాయర్ ప్రాజెక్టుకు సంబంధించి ఓటరు జాబితాలో పేర్ల గల్లంతుపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశాను. నేను గతంలో తాండవ ప్రాజెక్టుకు సంబంధించి బలిఘట్టం నుంచి రెండు పర్యాయాలు నీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేశాను. ఒకసారి ఎన్నికలో గెలుపొందగా.. మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాను. నాతవరం మండలం ములగపూడి రెవెన్యూ పరిధిలో అప్పట్లో ఉన్న భూములే నాకు ఇప్పుడూ ఉన్నాయి. కొత్త ఓటరు జాబితాలో నా పేరు లేదు. నాలాగే మా గ్రామంలో, మండల వ్యాప్తంగా వందలాదిమంది రైతులు ఓటు హక్కు కోల్పోయారు. అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్నారు. గత నెల 19న రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశాను.

–లాలం వెంకటరమణారావు,
బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు, ములగపూడి,
నాతవరం మండలం

బకాయిలు ఉంటే నామినేషన్ స్వీకరించం



నీటి సంఘం ఎన్నికల్లో పోటీ చేసే రైతులకు భూమి పన్నులు, నీటి తీరువా బకాయిలు ఏమీ ఉండకూడదు. ఒక్కపైసా బకాయి ఉన్నా నామినేషన్ తీసుకోవడం జరగదు. ఏకగ్రీవం అయిన వారు కూడా విధిగా బకాయిలు చెల్లించాలి. కలెక్టర్ ఆదేశాల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తాం.

– ఎ.వేణుగోపాల్, తహసీల్దార్,
నాతవరం మండలం

క్లుప్తంగా

బస్సు ఢీ కొట్టి రైతు మృతి


మృతి చెందిన మేడిశెట్టి నాగేశ్వరరావు

పాయకరావుపేట: మండలంలో కేశవరం గ్రామానికి చెందిన మేడిశెట్టి నాగేశ్వరరావు (68) బస్సు ఢీ కొట్టి మృతి చెందినట్లు సీఐ జి.అప్పన్న తెలిపారు. మృతుడు నాగేశ్వరరావు సోమవారం ఉదయం తన పొలానికి సైకిల్‌పై వెళ్తుండగా, వెంకటనగరం పోవు రోడ్డులో డెక్కన్ కంపెనీకి చెందిన బస్సు ఢీ కొట్టడంతో బలమైన గాయాలైనట్లు పేర్కొన్నారు. అతడిని కాకినాడ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రిక్షా కార్మికుడి మృతి

రాంబిల్లి (యలమంచిలి): రోడ్డు ప్రమాదంలో రిక్షా కార్మికుడు మృతి చెందాడు. రాంబిల్లి సీఐ సిహెచ్ నర్సింగరావు వివరాల ప్రకారం... రాంబిల్లి మండలం మామిడివాడ గ్రామానికి చెందిన రెల్లి సత్తిరాజు(54) రిక్షా కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి మామిడివాడ గ్రామం వద్ద గాజువాక–యలమంచిలి బైపాస్ రోడ్డు దాటుతున్న సమయంలో యలమంచిలి నుంచి అచ్యుతాపురం వైపు వెళ్తున్న బైక్ వచ్చి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు కుమారుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింగరావు తెలిపారు.

కుంచవానిపాలెం వాసిపై అట్రాసిటీ కేసు

మునగపాక: మండలంలోని కుంచవానిపాలెం గ్రామానికి చెందిన కాయల సత్తిబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన మైలపల్లి రేనేశ్వరరావు ఈ నెల 7వ తేదీన రాత్రి అచ్యుతాపురం మండలం ఇరువాడ నుంచి తన బైక్‌పై కుంచవానిపాలెం వస్తున్నాడని పేర్కొన్నారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన కాయల సత్తిబాబు రేనేశ్వరరావును అడ్డగించి చేతులతో కొట్టడంతో పాటు బెదిరించి కులం పేరుతో దూషించినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా సోమవారం సాయంత్రం పరవాడ డీఎస్పీ సత్యనారాయణ గ్రామంలో పర్యటించి, ఇరు వర్గాల నుంచి వివరాలు సేకరించారన్నారు.

బెర్మ్ దిగితే బోల్తా పడాల్సిందే..


కాగిత టోల్‌ప్లాజాకి, చినదొడ్డిగల్లుకు మధ్యలో బురదతో అధ్వానంగా ఉన్న ఎర్త్ అండ్ షోల్డర్ ప్రాంతం


కాగిత దగ్గర నాసిరకం మట్టితో నిర్మించిన బెర్మ్(ఎర్త్ అండ్ షోల్డర్)


బెర్మ్‌ల నిర్మాణానికి గ్రావెల్, కంకర బదులు నర్సరీ మట్టిని ఉపయోగిస్తున్న దృశ్యం

- నాసిరకం మెటీరియల్‌తో నిర్మాణం
- జాతీయ రహదారి అంచున పొంచి ఉన్న ప్రమాదం
- ప్రమాదాల బారిన వాహన చోదకులు
- ప్రయాణికుల భద్రత గాలికొది లేసిన హైవే అథారిటీ

సర్రున దూసుకుపోయే జాతీయ రహదారిపైన ప్రమాదకర ప్రయాణం తప్పడం లేదు. దీనికి ఇరు వైపులా ఏర్పాటు చేసిన బెర్మ్‌లు దిగాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. ఇవి గోతులు, బురదమయంగా మారడంతో తరచూ వాహనాలు బోల్తా పడుతున్నాయి. లక్షలాది రూపాయలు టోల్‌ఫీజు వసూలు చేస్తున్న నేషనల్ హైవే అథారిటీ వారు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నక్కపల్లి: జాతీయ రహదారిపై టోల్‌ఫీజు రూపంలో రోజూ లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న నేషనల్ హైవే అథారిటీ వారు వాహన చోదకులు, రాకపోకలు సాగించే వారి భద్రత గాలికొదిలేశారు. జాతీయ రహదారి అంచున ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కళ్ల ముందే ప్రమాదం జరిగే అవకాశాలు కనిపిస్తున్నప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం హైవే అథారిటీవారి నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది.

అనకాపల్లి నుంచి పాయకరావుపేట వరకు సుమారు 60 కిలోమీటర్ల 16వ నెంబరు జాతీయ రహదారి ఉంది. ఈ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జాతీయ రహదారి నిర్మాణం పూర్తయ్యాక రోడ్డుకు ఇరువైపులా ఎర్త్ అండ్ షోల్డర్స్(బెర్మ్)లు నిర్మించాల్సి ఉంది. గతంలో 30 ఏళ్ల క్రితం జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించిన సమయంలో ఈ రోడ్డుకు ఇరువైపులా బెర్మ్‌లు నిర్మించారు. 3 నుంచి 5 అడుగుల వెడల్పు కలిగిన ఈ ఎర్త్ అండ్ షోల్డర్స్‌ను నాణ్యమైన గ్రావెల్ వేసి నిర్మించాల్సి ఉంటుంది. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వారు వాహనాలు ఒకదాన్ని మరొకటి ఓవర్ టేక్ చేసే సమయంలో ప్రమాదం జరగకుండా రోడ్డు దిగడం, అలాగే రోడ్డుపై ఎడమ భాగంలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనాలకు, పాదచారులకు ఉపయోగపడే విధంగా వీటిని నిర్మిస్తారు. రోడ్డు అంచులు కోతకు గురికాకుండా, పాడవకుండా ఇవి రక్షణగా ఉంటాయి. నాలుగు లైన్ల రహదారిని ఎక్స్‌ప్రెస్ హైవేగా గుర్తించడంతో పెద్ద పెద్ద వాహనాలు అతివేగంతో ప్రయాణిస్తుంటాయి. ఇటువంటి సమయంలో చిన్నచిన్న వాహనాలు, ద్విచక్ర వాహనాలైన మోటారు సైకిళ్లు, సైకిళ్లపై వెళ్లేవారు, ఆటోలు తదితర వాహనాలు హైవే దిగడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ బెర్మ్‌లు ప్రస్తుతం చాలా అధ్వానంగా ఉన్నాయి.

బెర్మ్‌లు పాడై గోతులు..

జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థ బీవోటీ పద్ధతిలో కాంట్రాక్ట్ పనులు దక్కించుకుని రోడ్డు నిర్మిస్తారు. అగ్రిమెంట్ ప్రకారం సుమారు 30 ఏళ్లు జాతీయ రహదారి నిర్వహణ బాధ్యతలు కాంట్రాక్టర్ చూడాల్సి ఉంటుంది. నేషనల్ హైవే అథారిటీ వారు నిర్వహణను పర్యవేక్షించాలి. ప్రతి ఆర్నెల్లకొకమారు ఎర్త్ అండ్ షోల్డర్స్ పాడయితే తిరిగి పునర్నిర్మించాలి. ఇటీవల కాలంలో వీటిని నిర్మించేటప్పుడు నాణ్యమైన గ్రావెల్ వాడలేదు. బిల్డింగ్ మెటీరియల్(మరమ్మతుల సమయంలో తారురోడ్డు తవ్వకాల్లో వచ్చిన స్క్రాప్‌ను, మట్టిని) వేసి నిర్మిస్తున్నారు. నాణ్యమైన గ్రావెల్ వేసి పవర్ రోలర్‌తో రోలింగ్ చేసి నిర్మిస్తే నాణ్యత ఉంటుంది. కాని కాంట్రాక్టర్లు నాసిరకం మట్టిని లూజు మట్టిని వేసి తూతూమంత్రంగా బెర్మ్‌లను ఏర్పాటు చేయడం వల్ల మూన్నాళ్లకే గోతులు పడుతున్నాయి. వర్షాకాలంలో బురదగా మారుతున్నాయి.

బురద మట్టిలో పడి ప్రమాదాలు..

జాతీయ రహదారిపై రాకపోకలు సాగించేవారు రోడ్డు, ఎక్కి దిగే సమయంలో ఈ గోతులు, బురద మట్టిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో నామవరం, అడ్డురోడ్డు జంక్షన్ మధ్య జరిగిన పలు ప్రమాదాల్లో ద్విచక్ర వాహన చోదకులు ఇలా బెర్మ్‌లు ఎక్కి దిగే సమయంలో జరిగినవే కావడం గమనార్హం. ద్విచక్ర వాహనం స్కిడ్ అవడం వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టడం వంటి ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రయాణికుల భద్రత గాలికి...

నేషనల్ హైవే నిర్మించిన తర్వాత నిర్మాణ, నిర్వహణ ఖర్చుల నిమిత్తం టోల్‌ప్లాజాలు ఏర్పాటు చేసిన నిత్యం లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఈ ప్లాజాలు కొనసాగిస్తున్నారు. ఎన్ని సంవత్సరాలు కాంట్రాక్ట్ ఉంది అనేది కూడా ఎవరికీ తెలియదు. నిత్యం లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ ప్రయాణికులు, వాహనాల రాకపోకల భద్రత గాలికొదిలేసారని పలువురు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్రవాహన చోదకులు ఆదమరిస్తే ప్రమాదానికి గురవుతున్నారు. ఎర్త్ అండ్ షోల్డర్స్ చాలా ప్రమాదకరంగా ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిపై నిత్యం జరిగే రోడ్డు ప్రమాదాలను అరికడతామని పోలీస్ ఉన్నతాధికారులు చేస్తున్న ప్రకటనలు అమలు కావడం లేదు. ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తిస్తామని, వాటి దగ్గర ప్రత్యేక చర్యలు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని ఎస్పీ నుంచి సీఐ వరకు ప్రకటనలు చేస్తున్నారు. తరచూ ప్రమాదాలకు కారణమవుతున్న ఎర్త్ అండ్ షోల్డర్స్ అధ్వానంగా ఉన్న విషయం వారికి కనిపించకపోవడం శోచనీయం. ఇప్పటికైనా, పోలీసు, నేషనల్ హైవే అధికారులు స్పందించి గోతులు, బురదమయంగా తయారైన ఎర్త్ అండ్ షోల్డర్స్‌ను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించాలని, నాణ్యమైన గ్రావెల్ వినియోగించి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

తొందరలోనే సమస్య పరిష్కరిస్తాం



రహదారికి ఇరు వైపులా బెర్మ్‌ల వద్ద గోతులు, బురదగా ఉన్న విషయం గుర్తించడం జరిగింది. నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి వీటిని పూడ్చడం, నాణ్యమైన గ్రావెల్‌తో కొత్త రోడ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం. రహదారిపై రాకపోకలు సాగించేవారు రోడ్డు దిగి ఎక్కే సమయంలో తొందరపడొద్దు. జాగ్రత్తలు పాటించాలి. తొందరలోనే ఈ సమస్య పరిష్కరించే చర్యలు చేపడతాం.

– కుమారస్వామి, సీఐ, నక్కపల్లి

గ్రీవెన్స్‌లో ప్రతి అర్జీకి న్యాయం జరగాలి


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ జాహ్నవి



కరెంటు ఛార్జీల బాదుడుపై కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

- కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్
- ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

తుమ్మపాల : కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భూ సంబంధ సమస్యలు అధికంగా వచ్చాయి. దీంతో పాటు ట్రూఅప్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగంపై ప్రజలకు మరింత భారం మోపడం సరికాదని, స్మార్ట్ మీటర్లను అధిక ధరలకు కొనుగోలు చేసినట్టు చూపి వాటి ఖర్చులను కూడా ప్రజలపై రుద్దడం అన్యాయమని జిల్లా అపార్ట్‌మెంట్స్, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జోన్–7 (వార్వా) నాయకులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. విద్యుత్ వినియోగదారులపై ప్రభుత్వం వేసిన భారాన్ని తక్షణమే నిలిపివేయాలని పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వార్వా నాయకులు బి.ఉమామహేశ్వరరావు, పెంటకోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొత్తం 194 అర్జీలు

ప్రజలు అందించే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమెతో పాటు జేసీ జాహ్నవి, డీఆర్వో సత్యనారాయణరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు రీ ఓపెన్ కాకుండా, పెండింగు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మొత్తం 194 అర్జీలు నమోదు కాగా రెవెన్యూ సంబంధిత అంశాలపై 111 అర్జీలు, పంచాయతీరాజ్‌లో 15, పోలీస్ 11, సర్వే, హౌసింగ్, పొల్యూషన్, అగ్రికల్చర్ పలు శాఖలకు సంబంధించి ఫిర్యాదులు నమోదయ్యాయి.

రాత్రి వేళ అక్రమ క్వారీ...

అనకాపల్లి మండలంలో ఊడేరు సర్వే నెం.211లో మాధవ స్టోన్ క్రషర్ అనధికార నిర్వహణపై చర్యలు తీసుకుని తక్షణమే నిలిపివేయాలని కోరుతూ మాజీ సర్పంచ్ దండుపాటి సదానందరావు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ఖనిజాన్ని దోచేస్తున్న అంశంపై ఫిర్యాదుల మేరకు సీజ్ చేసి కోర్టులో కేసులు వేసినప్పటికి రాత్రి సమయాల్లో అక్రమంగా క్రషింగ్ చేస్తున్నారని ఆరోపించారు. మైన్స్ ఏడీ, పొల్యూషన్ బోర్డు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు.

దివ్యాంగుడిపై బంధువుల దాష్టీకం

అనకాపల్లి ఆవఖండం సర్వే నెం.1306–1లో గల భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని తనకు రక్షణ కల్పించాలని కోరుతూ పట్టణానికి చెందిన బుద్ధ శ్రీనివాసరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్ఎంపీ వృత్తితో జీవిస్తున్న తాను దివ్యాంగుడిగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని, తన పేరున అన్ని దస్తావేజులు, పట్టాదారు పాసుపుస్తకాలు కలిగి సాగులో ఉన్న భూమిని ఆక్రమించి తనకు తీవ్ర అన్యాయం చేస్తున్న బంధువులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలంటు ఎస్‌డీసీ రమామణిని వేడుకున్నారు.


భూ సమస్యను ఎస్‌డీసీ రమామణికి వివరిస్తున్న అర్జీదారు

ఎస్పీ కార్యాలయానికి 40 ఫిర్యాదులు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి : ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) 40 అర్జీలు వచ్చాయని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటూ ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్, ఇతర సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయన్నారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మోహన్‌రావు, ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


చీకట్లో ప్రయాణికులు


బోల్తా పడిన బస్సు

నక్కపల్లి: విజయవాడ నుంచి పార్వతీపురం వెళుతున్న ప్రైవేటు బస్సు సోమవారం రాత్రి మండలంలోని గొడిచెర్ల వద్ద బోల్తా పడింది. ముందు వెళుతున్న లారీని ఢీకొట్టి పక్కనే ఉన్న పొలంలోకి పల్టీ కొట్టింది. ఈ బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎవరికీ ఏమీ కాలేదు. తర్వాత అదే కంపెనీకి చెందిన బస్సులో వారు వెళ్లిపోయారు.

లేగదూడల ప్రదర్శనకు విశేష స్పందన


లేగదూడల ప్రదర్శనను పరిశీలిస్తున్న పశుగణాభివృద్ధి సంస్థ ఈవో ప్రసాదరావు


విజేతలకు బహుమతులను అందిస్తున్న ఈవో ప్రసాదరావు, ఏడీ దినేష్‌కుమార్

దేవరాపల్లి: నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులని, లేగదూడల పోషణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి బి.ప్రసాదరావు పాడి రైతులకు సూచించారు. నాగయ్యపేటలో పశు సంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన లేగదూడల ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. ఈ ప్రదర్శనలో 52 లేగదూడలు పాల్గొన్నాయి. వీటిలో ఆరోగ్యంగా ఉన్న లేగదూడలకు సంబంధించి రైతులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఈవో ప్రసాదరావు, కె.కోటపాడు పశు సంవర్ధకశాఖ ఏడీ ఈ.దినేష్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. లేగ దూడలు తీసుకొచ్చిన మిగిలిన రైతులందరికీ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అనంతరం పెయ్యిల యాజమాన్య పద్ధతులపై రైతులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యులు మంజుషారాణి, ప్రియాంక, పశువైద్య సిబ్బంది సురేష్, అప్పారావు, త్రినాథ్, రవీంద్ర, శ్రీను, మంగ పాల్గొన్నారు.

110 కేజీల గంజాయి స్వాధీనం

- దీని విలువ రూ.11 లక్షలు
- కేరళ, కర్ణాటకకు చెందిన ముగ్గురు నిందితుల అరెస్టు


గంజాయి నిందితులతో డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి: రావికమతం మండలం కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలో దొండపూడి చెక్‌పోస్టు వద్ద కారులో తరలిస్తున్న 110 కేజీల గంజాయి, రూ.14,050 నగదు స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. పట్టణంలోని తమ కార్యాలయంలో సోమవారం రాత్రి ఆమె విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కేరళకు చెందిన ఒకరు, కర్ణాటకకు చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి కర్ణాటకకు కారులో తరలిస్తుండగా, దొండపూడి చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డారన్నారు. పాడేరుకు చెందిన ఒక వ్యక్తికి రూ.2.50 లక్షలు చెల్లించి వంద కేజీల గంజాయి కొనుగోలు చేసినట్టు విచారణలో తేలిందన్నారు. ఇక్కడ నుంచి కర్ణాటక, కేరళ తరలించి కేజీ రూ.8 వేల చొప్పున విక్రయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుడివాడ రేషన్ డిపోను ఆదివాసీలకే కేటాయించాలి

చీడికాడ : మండలంలోని కోనాం శివారు గుడివాడ గ్రామంలో ఏర్పాటు చేయనున్న నూతన రేషన్ డిపోను ఆదివాసీలకు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం గౌరవ సలహాదార్ పి.ఎస్.అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం గుడివాడలో ఆదివాసీలతో కలిసి నిరసన తెలిపారు. ముందుగా ఈ నూతన రేషన్ డిపోను షెడ్యూల్ కులాల వారికి కేటాయించి, రాజకీయ ఒత్తిళ్ల మేరకు అదేరోజు బీసీ(డి)కి మార్చారని ఒకే రోజు రెండు ఉత్తర్వులు జారీ చేశారని ఆరోపించారు. నూతన రేషన్ డిపో పరిధిలో 449 రేషన్ కార్డులుండగా అందరూ ఆదివాసీలే ఉన్నారన్నారు. ఈ డిపోపరిధిలో గుడివాడ, వాకపల్లి, పనసగెడ్డ, జాజులపాలెం, మళ్లిపాడు, చెరుకుపల్లి, గోడుగుమామిడి, రెల్లలపాలెం గ్రామాల్లో మొత్తం అందరూ ఆదివాసీలే అని అన్నారు. ఒక్క కోణాం ప్రధాన గ్రామంలో తప్ప మరే గ్రామంలో బీసీ లేరన్నారు. కోనాం పంచాయతీలో ప్రజా ప్రతినిధులుగా బీసీలే ఉన్నారని, ఈ కారణంగా ఆదివాసీల ప్రయోజనాలకు భిన్నంగా ఈ చర్యలు తీసుకున్నారని ఆదివాసీలు భావిస్తున్నారన్నారు. తక్షణమే ఈ ఉత్తర్వును రద్దు చేసి గుడివాడ రేషన్ డిపోను షెడ్యూల్ తెగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్, ఆర్‌డీఓ, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందించనున్నట్టు తెలిపారు.

సూర్యకాంతం నటన అనితర సాధ్యం

- తెరపై గయ్యాళి పాత్రలో మెప్పించినా.. నిజ జీవితంలో మానవతామూర్తి
- శతజయంతి సందర్భంగా ఘన నివాళి


మాట్లాడుతున్న అనంత పద్మనాభమూర్తి

తుమ్మపాల : ప్రసిద్ధ సినీనటి సూర్యకాంతం శతజయంతి సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక రోటరీ కల్యాణ మండపంలో ఆమె చిత్రపటానికి సినీ అభిమానులు ఘన నివాళి అర్పించారు. ముఖ్య అతిథిగా ఆమె కుమారుడు డాక్టర్ అనంత పద్మనాభమూర్తి కుటుంబ సభ్యులు విచ్చేశారు. ఈ సందర్భంగా సూర్యకాంతం నటించిన సినిమాల్లోని ముఖ్య సన్నివేశాలతో కూర్పు చేసిన 30 నిమిషాల డాక్యుమెంటరీని అనకాపల్లి ఫిలిం సొసైటీ ప్రదర్శించింది. దీంతోపాటు అనకాపల్లి పట్టణానికి చెందిన ఔత్సాహిక కళాకారిణి తాను నటించి రూపొందించిన వీడియోలను కూడా ప్రదర్శించారు. సభకు విచ్చేసిన మరో అతిథి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ సూర్యకాంతం ఎక్కువ సినిమాలలో నటించిన 'అత్త' పాత్రను విశ్లేషించి వివరించారు. డైమండ్ హిట్స్ తరపున సూర్యకాంతంకు అనకాపల్లిలో ఘన సన్మానం నిర్వహించామని ఆయన గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయ ఉద్యమ నేత వేణుమాస్టర్ మాట్లాడుతూ తెలుగు సినిమా పరిశ్రమలో ఒక ప్రత్యేకమైన నటి సూర్యకాంతం అని, ఆమెకు ప్రత్యామ్నాయం లేదని కొనియాడారు. విశాఖ ఫిలిం సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ తెలుగు వారు ఉన్నంతవరకు సూర్యకాంతం నట వెలుగులు అస్తమించవని అన్నారు. అనకాపల్లి ఫిలిం సొసైటీ కార్యదర్శి అజయ్ కుమార్ మాట్లాడుతూ నటనలో సూర్యకాంతంది ఒక ప్రత్యేకమైన బాణీ అని దానిని అనుకరించడం అసాధ్యమని అన్నారు. సూర్యకాంతం కుమారుడు పద్మనాభమూర్తి మాట్లాడుతూ పట్టణం నుంచి అభిమానులు పంపిన బెల్లం దిమ్మలను తమిళనాడులో ఆలయాలకు వారి పేరుతో పంపి అభిషేకాలు చేయించేవారని గుర్తు చేశారు. వెండితెరపై గయ్యాళి అత్త పాత్రలో నటించినా, నిజజీవితంలో తానొక మానవతామూర్తి అని, సహనటులకు తన స్వహస్తాలతో భోజనం వండి తీసుకెళ్లేవారని, అనేక కుటుంబాలను నిలబెట్టడానికి గుప్త దానాలు చేశారని అన్నారు. అంతకుముందు 500 పేజీలతో రూపొందించిన సూర్యకాంత సావనీర్‌ను అనకాపల్లి ఫిలిం సొసైటీకి ఇతర అతిథులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఫిలిం సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి తమ్మన సుబ్బారావు, కోశాధికారి శ్రీధరల సూర్యనారాయణ, సినీ అభిమానులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కశింకోటలో అన్న సమారాధన



శివాలయ ఆవరణలో అన్న సమారాధన

కశింకోట: స్థానిక శివాలయంలో సోమవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణల ఆధ్వర్యంలో ఉదయం నుంచి కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. మధ్యాహ్నం పేదలకు అన్న సమారాధన నిర్వహించారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. బెండకాయ, వంకాయ, దొండకాయ రూ.40, టమాటా, ఉల్లి, బంగాళదుంప రూ.50, క్యారెట్, బీట్రూట్, గోరు చిక్కుడు, బీరకాయ రూ.60, పాదు చిక్కుడు, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి.

కిశోరి వికాసంపై ఒక రోజు శిక్షణ నేడు

అనకాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం మేడపైన ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ''కిశోరి వికాసం'' శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు సీడీపీవో పి.ప్రభావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ ఉద్యోగులు హాజరు కావాలన్నారు.

'బోధనేతర పనులు అప్పగించి రేటింగా?'

తుమ్మపాల: ఉపాధ్యాయులకు ఊపిరి సలపనివ్వని బోధనేతర పనులను ప్రభుత్వమే అప్పగిస్తూ స్కూళ్లకు రేటింగ్ ఇచ్చి వెనుకబడ్డాయని చెప్పడం విడ్డూరంగా ఉందని ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరీ విమర్శించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని బలపరచవలసిందిగా ఉపాధ్యాయులను కోరారు. ఐదేళ్లలో ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. మౌలిక వసతులు పూర్తిగా పాఠశాలలకు కల్పించకుండా రేటింగ్ ఇవ్వడం సరికాదన్నారు. మామిడిపాలెం, తుమ్మపాల, గవరపాలెం జీవీఎంసీ హైస్కూల్, గాంధీనగర్ జీవీఎంసీ హైస్కూల్, టౌన్ గర్ల్స్ హైస్కూల్, మున్సిపల్ పెద్ద హైస్కూలులో పర్యటించి ఓట్లు అడిగారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రాజునాయుడు, మండల అధ్యక్షుడు మామిడి బాబూరావు ప్రధాన కార్యదర్శి నాతవరపు సతీష్ పాల్గొన్నారు.

తగరంపూడి.. రండిరండి!

రెక్కల కష్టాన్ని నమ్ముకుని జీవిస్తున్న తగరంపూడిలో ఎటుచూసినా పచ్చని పొలాలే కనిపిస్తాయి. గలగల పారే నదులు ఇక్కడే కలుస్తుండటంతో త్రివేణి సంగమంగా ప్రత్యేకత సంతరించుకుంది. తూర్పున సంగమేశ్వరుని ఆలయం.. ఆహ్లాదకర వాతావరణంలో బోటు షికారు.. వంటి ఎన్నో విశేషాలు, విశిష్టత కలిగిన ఆ గ్రామంలో ఇప్పటికీ వివాదాలకు దూరంగా ఉండటం గ్రామస్తుల ఐక్యతను చాటి చెబుతోంది.

- వరద ముంపు ఎరగని ప్రాంతం
- తూర్పుభాగాన త్రివేణి సంగమం
- ఆహ్లాదకర వాతావరణంలో బోటు షికారు
- వ్యవసాయమే జీవనాధారం



తగరంపూడి గ్రామం

అనకాపల్లి: తగరంపూడిలో 80 శాతం రైతులు వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్నారు. వరదలు వచ్చినప్పటికి గ్రామంలో వరిపంట నీటి మునిగిన దాఖలాలు లేవు. అనకాపల్లి పట్టణానికి 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో 2,300 మంది జనాభా ఉండగా, 1,820 ఓటర్లు ఉన్నారు. గ్రామం తూర్పుభాగంలో సంగమేశ్వరుని ఆలయం ఉంది. అక్కడే తాచేరు (కింతలి), పెద్దేరు (కోనాం), శారదానది(రైవాడ) నదులు కలుస్తాయి. అక్కడ నుంచి వెంకుపాలెం, సీతానగరం, అనకాపల్లి పట్టణం మీదుగా కశింకోట మండలంలో శారదానది ప్రవహిస్తోంది.

గ్రామ ప్రత్యేకతలు...

- గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు కులమతాలకు అతీతంగా ఐక్యంగా జీవిస్తున్నారు. గ్రామంలో ఎక్కడైనా చిన్నపాటి గొడవలు జరిగినట్లయితే పెద్దలంతా ఒకదగ్గర కూర్చొని సమస్యను పరిష్కరించుకుంటారు. పోలీసులను ఎక్కువగా సంప్రదించరు.
- గ్రామంలో 477 గృహాలు ఉన్నాయి. 80 శాతం రైతులు ఉండడంతో 500 ఎకరాల్లో వరికోత కోసిన వెంటనే, జనవరిలో నువ్వు పంట వేస్తారు. 45 ఎకరాల్లో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తారు.
- గత వైఎస్సార్‌సీపీ పాలనలో రైతు భరోసా కేంద్రం, సచివాలయం, వర్మీ కంపోస్టు యార్డుల నూతన భవనాలను నిర్మించారు.
- తగరంపూడి కేంద్రంగా పీహెచ్‌సీని ఆధునికీకరించారు. దీని పరిధిలో రోగులకు 24 గంటలపాటు సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు.
- మైదాన ప్రాంతమైనప్పటికీ ఇక్కడ ఎస్టీ కులస్తులు జీవిస్తున్నారు.
- పుష్కలంగా తాగు, సాగునీరు ఉంటోంది.



శారదానదిలో బోటు షికారు ప్రదేశం



తగరంపూడిలో వరిపంట

- శారదా నదిలో పర్యాటకులు విహారయాత్ర చేసేందుకు గ్రామ సర్పంచ్ తన సొంత నిధులతో బోటు షికారు సౌకర్యం కల్పించారు.
- గ్రామంలో అన్ని రోడ్లూ పరిశుభ్రంగా కనిపిస్తాయి. ఎక్కడా చెత్తా చెదారం ఉండదు.
- గృహాలు వద్ద ఇంకుడు గుంతలు ఉంటాయి. డ్రైనేజీ సమస్య ఉండదు.
- ప్రతీ గృహానికి తాగునీటి కుళాయిలు ఉన్నాయి.



తగరంపూడి పీహెచ్‌సీ



గ్రామ సచివాలయం



గ్రామంలో ఆర్బీకే కేంద్రం

అభివృద్ధికి ప్రాధాన్యమిస్తా



అన్ని వర్గాల ప్రజలు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నారు. దీంతో పాటు గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి అన్ని విధాలా కృషి చేస్తున్నాను.

– యాదగిరి అప్పారావు, తగరంపూడి గ్రామ సర్పంచ్, అనకాపల్లి మండలం

జాతీయ స్థాయిలో గుర్తింపు



రెండు మాసాలు క్రితం నక్కపల్లి నుంచి తగరంపూడి గ్రామానికి సాధారణ బదిలీపై వచ్చాను. గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా పరిశుభ్రతను కోరుకుంటారు. అందువల్లే జాతీయ స్థాయి అవార్డు వచ్చింది.

– బీఎస్ఎస్ త్రినాథరావు, తగరంపూడి పంచాయతీ కార్యదర్శి, అనకాపల్లి మండలం

సమష్టి కృషితో సమస్యల పరిష్కారం



పూర్వీకుల నుంచి అందరూ కలసిమెలసి ఉంటున్నాం. గ్రామంలో ఎక్కడైనా సమస్య ఉన్నట్లయితే సమష్టి కృషితో పరిష్కారానికి కృషి చేస్తున్నాం. రైతులు ఎక్కువగా ఉన్న గ్రామం మాది. వరి, కూరగాయలు బాగా పండుతాయి.

– భరత్‌రాజు, గ్రామపెద్ద, తగరంపూడి గ్రామం

ఆకట్టుకున్న లఘు నాటికలు



గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రపై విద్యార్థులు ప్రదర్శిస్తున్న లఘు నాటిక



గణిత శాస్త్ర పాఠ్యాంశ భావనలపై విద్యార్థుల లఘు నాటిక ప్రదర్శన

కశింకోట: మండలంలోని వెదురుపర్తి హైస్కూలు లో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రపై విద్యార్థులు సోమవారం నిర్వహించిన లఘు నాటికలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. జాతీయ గణిత మాసోత్సవాల్లో భాగంగా ఈ నాటికతోపాటు గణితం నిజ జీవితంలో ఉపయోగపడే భావనలతో కూడిన నాటికను ప్రదర్శించారు. ఇవి ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా హెచ్‌ఎం జి.వి.కె ఆచారి మాట్లాడుతూ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్ర, గణిత భావనలపై విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు ఉపయుక్తంగా ఉన్నాయన్నారు. విద్యార్థులకు స్ఫూర్తిదాయంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులు ఎ.వి.ఎన్. మూర్తి, పి.వి.ఎస్. సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు బోయిన చిన్నారావు, విజయ్, సభిత లక్ష్మి, సోమరాజు, విజయలక్ష్మి, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

నేడు కన్యకాపరమేశ్వరి వెండి రథం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కన్యకాపరమేశ్వరి వెండి రథం

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులో కన్యకాపరమేశ్వరి ప్రతిష్టా శతజయంతి ఉత్సవాలలో భాగంగా రూ.1.10 కోట్లతో తయారు చేసిన వెండి రథాన్ని మాజీ రాజ్యసభ సభ్యుడు, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు టి.జి.వెంకటేష్ మంగళవారం ప్రారంభించనున్నట్లు ఆలయ వెండి రథం ప్రాజెక్టు చైర్మన్ అల్లెపు కామేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభం అనంతరం పట్టణంలో కన్యకాపరమేశ్వరి ఉత్సవ విగ్రహాన్ని వెండి రథంపై పట్టణ పురవీధుల్లో ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సులకు స్పందన కరవు

అధికారులు, కూటమి నేతలే హాజరు



కొప్పాక గ్రామ రెవెన్యూ సదస్సులో ఖాళీ కుర్చీలు



కొప్పాక సచివాలయంలో ఆన్‌లైన్ చేసేందుకు సిద్ధంగా ఉద్యోగులు

అనకాపల్లి: మండలంలో కొప్పాక, ఎరుకువానిపాలెం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులు తుస్సుమన్నాయి. కొప్పాక సచివాలయంలో రెవెన్యూ సదస్సుకు ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో తహసీల్దార్ శ్రీనివాసరావు, సదస్సులు ఇన్‌చార్జి ఎలక్షన్ డీటీ రాజ్యలక్ష్మి వెనుదిరిగారు. సదస్సులు వద్ద విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు, కూటమి నాయకులే కనిపించారు. ప్రజలు ఎవ్వరూ రాకపోవడంతో వారి కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

20 రోజుల్లోగా అర్జీల పరిష్కారానికి చర్యలు



చింతలపాలెం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కశింకోట: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను 20 రోజుల్లోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చింతలపాలెంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రీసర్వేలో లోపాలు, పాసు పుస్తకాల్లో యజమాని పేర్లు, ఫొటోలు, హక్కుదారుల పేర్లు తప్పుగా పడినా వాటిని సరి చేస్తామన్నారు. రీసర్వే కాకుండా ఉన్న భూమికి, ఇతర రెవెన్యూ సమస్యలపై అర్జీలు అందజేస్తే పరిశీలించి సకాలంలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అర్జీలు ఇచ్చిన వారు తప్పనిసరిగా ఎక్నాలెజ్‌మెంటు పొందాలన్నారు. ఈ సందర్భంగా రైతులు పలు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో రీసర్వే ఉప తహసీల్దార్ భాస్కరరావు, వీఆర్వో నాయుడుబాబు, సచివాలయ సర్వేయర్ ప్రసాద్, ఉప సర్పంచ్ బల్ల అప్పలకొండ, మాజీ సర్పంచ్‌లు కర్రి దుర్గినాయుడు, మేడిశెట్టి వెంకటరమణ, మండల టీడీపీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల నూకినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 4,627 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,500	4,700
మొదటి రకం	3,510	4.250
రెండో రకం	3,050	3,840
మూడో రకం	2,880	3,160

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	: రాజా
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
పుష్ప-2	: పర్తిసాయి
పుష్ప-2	: షిర్డీసాయి
లక్కీ భాస్కర్	: వెంకటేశ్వర
దేవర	: శ్రీసత్య
పుష్ప-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 41 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-9 యూనిట్లు, ఓ పాజిటివ్-25 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 424 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 352 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

బీమాతో బాధిత కుటుంబానికి భరోసా



బీమా చెక్కు అందిస్తున్న మేనేజర్ సత్యనారాయణ

తుమ్మపాల: ప్రతి ఒక్కరూ బీమా కలిగి ఉండాలని, తద్వారా కుటుంబానికి భరోసా కలుగుతుందని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ఎస్.సత్యనారాయణ అన్నారు. పట్టణంలో ఇండియన్ బ్యాంక్‌లో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పథకం ద్వారా రూ.2 లక్షల చెక్కును కాపుశెట్టివానిపాలెం గ్రామానికి చెందిన కొసిరెడ్డి లక్ష్మి కుటుంబ సభ్యులకు సోమవారం ఆయన అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి పథకంలో ఏటా రూ.436 బీమా ప్రీమియం చెల్లించడం ద్వారా సాధారణ మరణానికి రూ.2 లక్షలు పొందుతారన్నారు. 18 నుంచి 50 ఏళ్ల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ కేంద్ర బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనలో ఏడాదికి రూ.20 ప్రీమియం ద్వారా ప్రమాద బీమా రూ.2 లక్షలు పొందవచ్చన్నారు. రూపే ఏటీఎం కార్డు పొంది ఉంటే రూ.1 లక్ష ప్రమాద బీమా వస్తుందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మిత్ర కోన నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో అభయ్ ప్రతిభ



అభయ్‌కుమార్‌ను అభినందిస్తున్న విస్తం కళాశాల ప్రిన్సిపాల్ శివకుమార్

పెందుర్తి: ఆంధ్ర యూనివర్శిటీ జిమ్నాజియంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఏపీ కిక్ బాక్సింగ్ పోటీల్లో పెందుర్తి మండలం పినగాడిలోని విస్తం ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి టి.అభయ్‌కుమార్ స్వర్ణ పతకం సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభయ్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శివకుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.అనంద్‌కుమార్, హెచ్‌వోడీ జోసెఫ్ నోయల్, ఫిజికల్ డైరెక్టర్ బి.రమణారావు, సిబ్బంది అభినందించారు.

జీతాలు పెంచాలని కాంట్రాక్టు కార్మికుల వినతి



కార్పొరేటర్ సునీతకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

అనకాపల్లి: జోనల్ పరిధిలో నీటిపారుదల విభాగంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంపుపై ఈ నెల 11న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడాలని జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్, లేబర్ యూనియన్ జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యం కోరారు. స్థానిక నర్సింగరావుపేటలో 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీతకు యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నీటిపారుదల విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు జీతాలు పెంపు కోసం గత నెల 24, 25, 26 తేదీల్లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే అమలు చేయాలని, జీవీఎంసీలో కాంట్రాక్టులకు, గుత్తేదారులకు చెల్లిస్తున్న షెడ్యూల్ ఆఫ్ రేట్లకు అనుగుణంగా అన్ స్కిల్డ్ ఉద్యోగులకు రూ.25 వేలు, సెమీ స్కిల్డ్ ఉద్యోగులకు రూ.30 వేలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణ మనందరి బాధ్యత



ఎదురులేని ఏడు నవలను ఆవిష్కరిస్తున్న రచయితలు

తుమ్మపాల: తెలుగు భాషను కాపాడుకుని భవిష్యత్ తరాలకు అందించడం మనందరి బాధ్యత అని తెలుగు భాష పరిరక్షణ సమితి సమన్వయకర్త కోయిలాడ రామ్మోహన్‌రావు అన్నారు. ప్రిన్సిపాల్ శ్రీధర్ ఆధ్వర్యంలో గవరపాలెం షిర్డీసాయి లా కళాశాలలో సోమవారం జరిగిన తెలుగు భాష పరిరక్షణ 100వ కార్యక్రమంలో ఆయనతో ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ప్రముఖ రచయిత్రి కలవల గిరిజారాణితో కలిసి మాట్లాడుతూ సమితి ద్వారా తెలుగు భాష పరిరక్షణపై అనేక కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నామన్నారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు భాష అభివృద్ధిపై రెండేళ్లుగా 99 కార్యక్రమాలు చేపట్టామన్నారు. విద్యార్థులకు రామాయణం, మహాభారతం వ్యాసాలపై పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశామన్నారు. అంతకుముందు ఎదురులేని ఏడు అనే నవలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ దంత వైద్యులు శ్యామ్‌సుందర్, కథా రచయిత జి.రంగబాబు, అమరజ్యోతి, లక్ష్మి, శిష్టా తిమ్మరాజు, మాధవి సనారా, కర్రి మల్లేశ్వరి, జగదీష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శివాలయ పునర్నిర్మాణానికి రూ.2.30 లక్షల విరాళం

సబ్బవరం: స్థానిక శివాలయ పునర్నిర్మాణానికి సబ్బవరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బోకం సత్యానారాయణ రూ.2.30 లక్షల విరాళాన్ని సోమవారం అందించారు. ఆలయంలోని ఫ్లోరింగ్ ఏర్పాటుకు విరాళం అందించినట్లు తెలిపారు. ఈ మేరకు నగదు మొత్తాన్ని నిర్మాణంలో ఉన్న స్వామివారి ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులకు స్వయంగా అందించారు. కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

థాంగ్ టా పోటీల్లో ప్రతిభ



విజేతలతో పాఠశాల యాజమాన్యం

పరవాడ: రాష్ట్ర థాంగ్ టా ఫెడరేషన్ ఆధ్వర్యంలో అచ్యుతాపురంలో జరిగిన పోటీల్లో ఎన్టీపీసీ దీపాంజలి నగర్ బాలభారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి, పతకాలు సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.వాసంతిదేవి సోమవారం మీడియాకు తెలిపారు. పోటీలో డి.ధనహర్షిణి, కె.సాయి రాగిణి, అశ్విన్ అనీష్ స్వర్ణ పతకాలు, సమీక్ష సాహు, జె.రిషిక, చేతన్‌సాయి రజత పతకాలు, సాయి నారాయణ కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. విజేతలకు స్కూల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పీటీ షెల్టన్ జేమ్స్‌లతో కలిసి సిబ్బంది అభినందించారు.

'అదానీ అవినీతికి కొమ్ముకాస్తున్న మోదీ ప్రభుత్వం'



నెహ్రూచౌక్ వద్ద మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

అనకాపల్లి: అదానీ గ్రూప్ కంపెనీల అవినీతి, తప్పిదాలు, క్రోనీ క్యాపిటలిజంను ప్రోత్సహిస్తున్న మోదీ న్యాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ పాత్రపై జాయింట్ పార్లమెంటరీ బృందాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ జోనల్ కార్యదర్శి వై.ఎన్.భద్రం డిమాండ్ చేశారు. సీపీఐ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం స్థానిక నెహ్రూచౌక్ వద్ద ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఆదానీ అవినీతిని సమర్థిస్తున్న మోదీ ప్రభుత్వం గద్దె ది గాలని కోరారు. మణిపూర్ హింసాత్మక ఘటనలపై పార్లమెంట్లో చర్చించాలని, కేంద్ర బలగాలతో ప్రత్యేక రక్షణ కల్పించాలని, అధిక ధరలను అరికట్టాలని, నిరుద్యోగం నిర్మూలనకు ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. మోదీ ఆదేశాలు మేరకు రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమని, తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, నాయకులు కె.సన్యాసిరావు, చెల్లూరి నాగరాజు, కోరుబిల్లి శంకరరావు, ముక్కామల చిన్ని, కొండూరు వీరాచారి, మత్తుర్తి సూరిబాబు, నరాల శెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో డిగ్రీ కళాశాల విద్యార్థి సత్తా



యశ్వంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి, తదితరులు

సబ్బవరం: ఇండియన్ బాక్సింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన విశాఖ ప్రొఫెషనల్ బాక్సింగ్ లీగ్‌లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి కండిపల్లి యశ్వంత్ బంగారు పతకాన్ని సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి సోమవారం తెలిపారు. కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ ఫస్టియర్ చదువుతున్న యశ్వంత్ ఈ నెల 8న 54 కిలోల విభాగంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని, ఈ పతకాన్ని సాధించాడని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బందితో కలిసి, అభినందించారు. బాక్సింగ్‌లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. అభినందించిన వారిలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, ఎంపీ రామకృష్ణ, కంప్యూటర్ అధ్యాపకులు గణేష్, కళాశాల జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ లెక్కల గణేష్ తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి



పెందుర్తి: స్థానిక నాలుగు రోడ్ల కూడలి కొత్తవలస బస్టాప్ వద్ద అపస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని ఓ వ్యక్తిని సోమవారం ఉదయం పెందుర్తి పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం అతడు మృతి చెందినట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. వివరాలు. కొత్తవలస బస్టాప్ షెల్టర్ వద్ద ఓ వ్యక్తి(45) అపస్మారక స్థితిలో ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అతడ్ని 108లో కేజీహెచ్‌కు తరలించి, చికిత్స అందించారు. చికిత్స పొందుతూ మరణించాడు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచినట్లు సీఐ వెల్లడించారు. వివరాల కోసం 94407 96039, 96767 97314 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.